క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కి ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్. సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు నవంబర్ నెల నుంచి ఆదివారంకు బదులుగా శుక్రవారం అందుబాటులో ఉంటారన్నారు. డాక్టర్ వి.నారాయణరెడ్డి సర్జికల్ గ్యాస్ట్రో ఏంటరాలజిస్టు 24 గంటలు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. అలాగే ఉదయం 6 గంటల నుంచి ఉచితంగా షుగర్ పరీక్షలు చేస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి సలహాలు సూచనలు ఇస్తారన్నారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న పులివెందుల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం


జిల్లా కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : పట్టణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యలను విని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీటిపైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పందిస్తూ గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన తప్పిదముల వలన ఎంతోమందికి వైఎస్సార్‌సీపీ పథకాలు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో 2004 నుంచి 2014 వరకు ఉన్న టీడీపీ పాలనలో రాజీవ్‌నగర్ కాలనీలో చాలా మంది నిరుపేదల పేరుతో ఇళ్లను నిర్మించారు. ప్రస్తుతం ఆ ఇళ్లలో ఇల్లు మంజూరైన వారు కాకుండా ఎవరో నివాసం ఉంటున్నారు. ఇప్పుడు వారు ఇంటి నివాస స్థలం, ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటే గతంలో ఇళ్లు వచ్చినట్లు చూపుతుండటంతో ప్రస్తుతం వారు అర్హత కోల్పోతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీ సభ్యుల పేరుతో విపరీతంగా దొచుకోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే ప్రజల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ విచారించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

తప్పులులేని ఓటర్ల జాబితా రూపొందించాలి

వేంపల్లె : తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఓట్ల మార్పులు, చేర్పులపై బీఎల్‌ఓలకు ఆర్డీఓ పలు దిశానిర్దేశాలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కని, ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాల్సిన అవసరం ఉందని, ఓటర్ల జాబితా సిద్ధం చేయడంలో బూత్‌లెవెల్ అధికారుల (బీఎల్‌ఓ)తో పాటు ఈ ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఒక్కరు నియమనిబంధనలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు చేయడానికి ఫారం-6, 7, 8లో దరఖాస్తులు తీసుకుని వాటిని పరిశీలించి సరైన నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్‌బాబు, వేంపల్లె, చక్రాయపేట తహసీల్దార్లు చంద్రశేఖర్ రెడ్డి, రాజసింహ నరేంద్ర, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

అమృత కలశ యాత్రను ఆశీర్వదించండి

పులివెందుల టౌన్ : అమృత కలశ యాత్రను ఆశీర్వదించాలని కడప నెహ్రూ యువకేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ, స్థానిక స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు పులివెందులలో అమృతకలశ యాత్ర అవగాహన ర్యాలీని ప్రారంభించి మట్లాడారు. అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పవిత్రమైన 66 అమృతకలశాలను సేకరించామన్నారు. వీటిని శుక్రవారం విజయవాడకు రైలులో తీసుకెళ్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో ఏపీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు ప్రారంభించనున్నారని వారు తెలిపారు.

రాష్ట్ర బ్రహ్మసేన వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా మాధవాచారి

పులివెందుల రూరల్ : రాష్ట్ర బ్రహ్మసేన వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా మాధవాచారి నియమితులయ్యారు. నియామకపత్రాలను గురూజీ కృష్ణమాచార్యులు నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ స్థాపణకు ఆధ్యాత్మిక భావాలు ఎంతో అవసరమన్నారు. నేటి యువత కూడా సన్మార్గంలో నడవడానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఎంతో దోహదపడతాయన్నారు. బ్రహ్మపథం కూడా మనిషి జీవన విధానం జీవిత లక్ష్యాన్ని నేర్పుతుందన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామంతో పాటు ఆధ్యాత్మిక భావాలు అలవరచుకుంటే సమాజం పురోగతి చెందుతుందన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం


పులివెందులలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


జమ్మలమడుగులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వేంపల్లె : రోగులకు మందులను అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికి ఆరోగ్యం కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నగరిగుట్ట అర్బన్ హెల్త్‌సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఎటువంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇందులో 402 మందికి బీపీ, షుగర్, డెంగ్యూ, మలేరియా, తదితర దీర్ఘకాలిక జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజుల్లా, కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కాంతమ్మ, షాహీదా, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దయ్య, వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఐసీడీఎస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఒక వరం అని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వెంకటేశ్వర కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారు మూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఒక్క రూపాయికూడా తీసుకోకుండా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు, కో అప్షన్ మెంబర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని కుమ్మరాంపల్లి గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు ప్రారంభించిన మాట్లాడారు. సీఎం జగన్ పాలన అందరికీ ఆదర్శంగా, అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ప్రజారోగ్య దృశ్య ప్రజల వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మునేష్, మాజీ సర్పంచ్ రామాంజనేయులురెడ్డి, ఉపసర్పంచ్ మల్లేష్, వైద్యులు స్వాతిసాయి, లక్ష్మిప్రియ, మమతప్రియ, పూజిత, ఆనంద్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని అన్నమాచార్య కళాశాల విద్యార్థులు అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ తమ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఈఈఈ విద్యార్థులు ఆర్. మోహన్, మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.ఎఫ్రెయిమ్‌లు ఇటీవల నెల్లూరులో నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి ఎంపికైనట్లు తెలిపారు.

అధిక లోడ్‌తో వెళ్లితే చర్యలు

పులివెందుల రూరల్ : ఆటోలు, లారీలు అధిక లోడ్‌తో వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా అధిక లోడ్‌తో వెళ్తూ తరచూ ప్రమాదాలకు వాహనాలు గురవుతున్నాయని, దీంతో ప్రాణనష్టం కూడా జరు గుతోందని, అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలు కనిపిస్తే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామన్నా రు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణిస్తే వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలను తమ పిల్లలకు ఇవ్వరాదన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించి లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలన్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి


ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి

కమలాపురం : జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రైతన్నలు సాగు చేసిన పంటలన్నీ నిలువునా ఎండి పోతున్నాయని, జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పల్లెబాట పట్టి పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని జి.అప్పాయపల్లె, నల్లింగాయపల్లె గ్రామాలలో ఎండిపోయిన మినుము, కంది, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ విపత్తుతో సాగు చేసిన పంటలన్నీ ఎండు దశకు చేరుకున్నాయని, దీంతో సన్న, చిన్న కారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే అధికారులను క్షేత్ర స్థాయికి పంపించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవడానికి చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ జిల్లా కరువు కోరల్లో చిక్కుకుందని, రైతులకు భరోసా ఇచ్చే విధంగా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పొలం బాట పట్టాలన్నారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తిరిగి పంటలు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టక పోతే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు కోటేశ్వర్‌రెడ్డి, పెంచలయ్య, వాసుదేవరెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

చీనీ ధరలు పెరగడంతో రైతుల హర్షం


మార్కెట్‌యార్డులో చీనీకాయలకు వేలంపాట నిర్వహిస్తున్న చైర్మన్ చిన్నప్ప, రైతులు

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీకాయల ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో మార్కెట్‌కు చీనీ కాయలు తరలించే రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల ప్రాంతంలోని రైతులకు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రత్యేక శ్రద్ధతో చీనీకాయల కొనుగోలు కేంద్రాలతో పాటు చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పులివెందుల ప్రాంతంలో పండించిన చీనీకాయలను రైతులు మార్కెట్‌కు తరలించి విక్రయాలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పులివెందులలోని చీనీకాయల మార్కెట్‌లో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా చీనీ టన్ను ధర రూ.37,100లు పలకడంతో చీనీ కాయలకు మంచి లాభాలు వస్తున్నాయని ఆయన అన్నారు. అనంతపురం జిల్లా చీనీ మార్కెట్ కంటే పులివెందుల చీనీ మార్కెట్‌లో చీనీకాయలు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తాం


ఆయుర్వేద వైద్యశాల అప్‌గ్రేడ్‌పై రాజోలు వీరారెడ్డితో చర్చిస్తున్న కమిషనర్ రాజేంద్రకుమార్

వల్లూరు : పెద్దపుత్త గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తామని ఆయుష్ కమిషనర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం పెద్దపుత్తలోని ఆయుర్వేద వైద్యశాలను పరిశ్రమల రాష్ట్ర సలహాదారుడు రాజోలి వీరారెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెద్దపుత్తలో ఆయుర్వేద వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఇందుకుగాను అవసరమైన భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అయితే భవన నిర్మాణానికి స్థలంతో పాటు మరో రూ.20లక్షలు గ్రామ ప్రజలు పోగు చేస్తే ఈ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. అలాగే అవసరమైన వైద్యాధికారులను, సిబ్బందిని నియమిస్తామన్నారు. ఇండస్ట్రీస్ స్టేట్ అడ్వైజర్ రాజోలు వీరారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చొరవతో పెద్దపుత్త గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాల ను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. తద్వారా వైద్య సేవలు మరింత చేరువవుతాయన్నారు. ఆర్‌డీడీ కేపీ కుమార్‌బాబు, ఏఓ భుస్‌జరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

పులివెందుల : జగనన్న పాలవెల్లువ పథకంలో భాగస్వాములైన 3,225 మంది పాడి రైతులకు అమూల్ సహకార సంఘం నగదు ప్రోత్సాహకాన్ని అందజేసిందని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఏరియా కోఆర్డినేటర్ నీలకంఠారెడ్డితో కలిసి ఓ ప్రకటనలో తెలిపారు. అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్న అర్హులైన పాడి రైతులకు ఒక లీటరుకు 50పైసలు వంతున నగదు ప్రోత్సాహకాన్ని రైతుల ఖాతాలకు విడుదల చేసినట్లు తెలిపారు. పాల డైరీలను బలోపేతం చేసే లక్ష్యంతో జాతీయస్థాయిలో పేరుగాంచిన అమూల్‌తో కలిసి ప్రభుత్వం 2019 డిసెంబర్‌లో జగనన్న పాలవెల్లువ పథకానికి శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. పులివెందుల నియోజకవర్గంతో పాటు వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి మండలాల్లో 3,225 మంది అర్హత కలిగిన పాడి రైతులకు సుమారు రూ.21,70,062లు కానుకగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఏడాదికి 180 రోజులు అమూల్ కేంద్రాలకు పాలు పోసిన వారు ఇందుకు అర్హులన్నారు. జగనన్న పాలవెల్లువ పథకాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకుని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలన్నారు.

జగనన్న పాల వెల్లువ - వైఎస్సార్ జిల్లా

మండలం	గ్రామాల సంఖ్య	లీటర్లు	నగదు
చక్రాయపేట	47	811	రూ.9,10,984.01
లింగాల	22	743	రూ.4,19,410.54
పెండ్లిమర్రి	9	70	రూ.17,890.02
పులివెందుల	10	273	రూ.1,34,344.60
సింహాద్రిపురం	21	470	రూ.2,51,969.06
తొండూరు	10	262	రూ.1,35,903.21
వీఎన్ పల్లె	5	40	రూ.6,025.93
వేంపల్లె	12	179	రూ.99,291.10
వేముల	17	377	రూ.1,94,244.48
మొత్తం	153	3225	రూ.21,70,062.95

జూదరులు అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కొత్తగుంటపల్లె సమీపంలో శుక్రవారం జూదమాడుతున్న 5 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40,700 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

అలాగే మద్యం తాగి మోటార్ బైక్ నడిపిన ముగ్గురు వ్యక్తులను పట్టణంలోని సెకండ్ మేజిస్ట్రేట్ లక్ష్మయ్య ఎదుట హాజరుపరుచగా వారికి రూ.14,500 జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

కొండాపురంలో..

కొండాపురం : పాతకొండాపురం సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుమందిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.2400 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు.

ఎన్‌సీసీతో ఉద్యోగ అవకాశాలు

కమలాపురం : విద్యార్థులు ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణతో పాటు సులభంగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ పి.సుదర్శన్‌రెడ్డి ఈనెల 12 నుంచి 23వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగిన ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. శుక్రవారం ఆ కళాశాలలో సుదర్శన్‌రెడ్డిని కరస్పాండెంట్ మెడల్, ప్రశంశా పత్రంతో అభినందించారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వల్ల శారీరక, మానసిక దృఢత్వం పొందుతారన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పల్లాకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలి

పులివెందుల టౌన్ : మాదిగల సాంఘిక సంక్షేమ శాఖను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా పులివెందులలోని యర్రగుడిపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో మాదిగలకు మరో మంత్రి శాఖను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ మాదిగల సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. మహారాష్ట్ర తరహాలో సాంఘిక సంక్షేమ శాఖ నుంచి ఈ కులాల అభివృద్ధికి ఖర్చు చేసేవిధంగా కొత్త చట్టం రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శ్రీరాములు మాదిగ, అరవిందు పాల్గొన్నారు.

పరామర్శ

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 16వ డివిజన్ బలిజపల్లి గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త నాదం చిన్నోళ్ల శివనాగయ్య ఇటీవల ప్రమాదానికి గురైన విషయాన్ని తెలుసుకుని శుక్రవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన మరో కార్యకర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

అంకమ్మ దేవాలయం పునఃనిర్మాణానికి శ్రీకారం

ఎర్రగుంట్ల : పట్టణంలోని నడివూరులో ఉన్న అతి పురాతనమైన అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణానికి నడివూరు దేవాలయ కమిటీ నిర్వాహకులు ముందుకు వచ్చారు. శుక్రవారం రూ.22 లక్షల నిధులతో ఆలయ పునఃనిర్మాణానికి ఆళ్లగడ్డకు చెందిన శిల్పులకు అప్పగించారు. ఈ ఆలయంకు సుమారు వంద సంవత్సరాల చరిత్ర ఉందన్నారు.

అణువణువునా రగిలే దేశభక్తి


మేరీ మట్టి.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా త్రివర్ణ పతాకంతో ర్యాలీగా వెళుతున్న విద్యార్థినులు

వైవీయూ : నా మట్టి.. నా దేశం.. అంటూ విద్యార్థులు అణువణువునా దేశభక్తి నింపుకుని చేపట్టిన తిరంగా యాత్ర ఎంతో ఉత్సాహంగా సాగింది. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'మేరీ మట్టి.. మేరీ దేశ్' కార్యక్రమంలో భాగంగా అమృత కలశయాత్ర నిర్వహించారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్ గౌడ్ విచ్చేసి జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభించారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు 'అమృత కలశ యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సేకరించిన మట్టిని కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా కలశాల్లో వేసి వీరుల త్యాగఫలాల గురించి వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థినులు భారీ త్రివర్ణ పతాకంతో మానవహారం నిర్వహించారు.

రైతుల సంక్షేమమే జగనన్న లక్ష్యం


వైఎస్సార్ శాశ్వత క్లీనిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు


సింహాద్రిపురం : రైతుల సంక్షేమమే జగనన్న లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కసనూరు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ శాశ్వత క్లీనిక్ భవనాన్ని, నూతన సచివాలయాన్ని ఆయన ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. రబీలో సాగుచేసిన పంటలకు 9 గంటలు విద్యుత్ కల్పించే విధంగా చూస్తామన్నారు. అలాగే కాలువలకు నీరు వదిలి రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. పైడిపాలెం ప్రాజెక్టు, చిత్రావతి ప్రాజెక్టుల నుంచి వెంటనే నీరు విడుదల చేసేవిధంగా సంబంధిత అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 9 గంటల విద్యుత్‌తో పాటు కాలువలకు నీటిని విడుదల చేయడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దీంతో గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ అగ్రికల్చర్ బోర్డు మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, నెట్‌క్యాప్ డైరెక్టర్ కిషోర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ ఝాన్సీరాణి, ఎంపీటీసీ సుహాసిని, సర్పంచ్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథరెడ్డి, రఘునాథరెడ్డి, అరవిందనాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివకిషోర్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, కొత్తూరు చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించటానికి అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటికే పట్టణంలో కన్నెలూరు, నాగులకట్ట, టీచర్స్‌కాలనీ, నవాజ్ కట్ట ప్రాంత వాసులకు వైద్య పరీక్షలను నిర్వహించామన్నారు. ప్రస్తుతం పట్టణంలో దోమల బెడద ఎక్కువైందని ప్రజలనుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వాటిని తగ్గించటానికి ఫాగింగ్ చేయడంతోపాటు కాలువల్లో దోమలు లేకుండా ఆయిల్ కాయిల్స్ వేసేవిధంగా అధికారులు చర్యలను తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో రోడ్లు, కాలువలు లేని ప్రాంతాలలో సీసీ రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే అధికారులు తాగునీటి సమస్యలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు


జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందివ్వడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక చిన్నకొండప్పకాలనీ సచివాలయ పరిధిలోని మారుతిహాల్ రోడ్డు, శ్రీరామా ఆయిల్‌మిల్ రోడ్డు, మాధురి ఐస్‌ఫ్యాక్టరీ వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్తూ ప్రతి ఒక్క కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని ఆయన వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్లు లక్ష్మిభార్గవి, శ్యామల, గుల్జార్, పార్నపల్లి కిశోర్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, పద్మనాభరెడ్డి, ఖాదర్‌వలి, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితా

వీరపునాయునిపల్లె : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితాను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎస్.పాలగిరి, గంగిరెడ్డిపల్లె, వెల్దుర్తి రైతు భరోసా కేంద్రాల్లో జరుగుతున్న సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట నమోదు చేసిన ప్రతి రైతు తమ పేరు, సాగు చేసిన పంట, విస్తీర్ణం జాబితాల్లో ఉందా లేదా అని చూసుకోవాలని ఏవైనా పొరపాట్లు ఉంటే ఈనెల 29వ తేదీలోపు వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని చూసించారు. రైతుల నుంచి అందిన అభ్యంతరాలను పరిష్కరించి నవంబర్ 1వ తేదీన తుది జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఈకేవైసీ 100 శాతం పూర్తైందన్నారు. జాబితాలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించిన రైతులు రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి జెండా పండుగ

జమ్మలమడుగు : పట్టణంలో దస్తగిరిస్వామి జెండాను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. దస్తగిరిస్వామి జీవిత చరిత్ర పుస్తకాన్ని పీఠాధిపతులు చదివి భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా దస్తగిరిస్వామి దర్గాల వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్థానయే గౌసియాపీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, జామియా మసీదు సయ్యద్‌షా సాదిక్ పాషాఖాద్రీలు జ్ఞాపికల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో జ్ఞాపికలు తిలకించటానికి వచ్చారు. వచ్చిన భక్తులు కానుకలు సమర్పించారు.